క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ప్యాపిలి గ్రామానికి చెందిన తమ్మినేని రాజశేఖర్‌నాయుడు, సుగుణ కుటుంబ సభ్యులు రూ.50వేల విరాళాన్ని ఆదివారం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. దాతలను దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరి తిరునాల



బేతంచెర్ల: పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గౌరిహుసేన్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి గ్రామ దేవత సుంకులమ్మ ఆలయం నుంచి అమ్మవారి జ్యోతుల మహోత్సవం జరుగుతుందన్నారు. మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపు ఉంటుందన్నారు.

8వ తేది ఉదయం బోనాల కార్యక్రమం, 9వ తేదీ రాష్ట్ర స్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ. 10 వేలు అందచేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440463977, 9440773232 నంబర్లను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న డ్రైవర్లు

ప్యాపిలి: అనారోగ్యంతో మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి తోటి డ్రైవర్లు అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబానికి రూ. 68 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్యాపిలికి చెందిన డ్రైవర్ చిన్న పులికొండ కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించిన తోటి డ్రైవర్లు చేయి చేయి కలిపి రూ. 68 వేలు సేకరించారు. సేకరించిన మొత్తాన్ని మృతుడి భార్య కల్పనకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డ్రైవర్లను స్థానికులు అభినందించారు.

కబడ్డీ విజేత ప్యాపిలి



విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. యువకుల ఈలలు, కేరింతల మధ్య హోరాహోరీగా సాగిన పోటీల్లో ప్యాపిలి మండలం జట్టు విజేతగా నిలిచింది. కొలిమిగుండ్ల మండలం, పెట్నికోట ద్వితీయ, ఓర్వకల్లు మండలం శకునాల తృతీయ, గోస్పాడు మండలం సాంబవరం నాల్గవ, బేతంచెర్ల హెచ్ఎంటీ జట్టు 5వ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 7 వేలు, రూ. 5 వేల నగదు బహుమతులను అందజేశారు.

వలిమాలో మాజీ ఎమ్మెల్యే కాటసాని



వలిమా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన కీశేలు హజరత్ షేక్‌హుస్సేన్ సాహెబ్ షాఖాద్రీ, రమీజాబి దంపతుల కుమారుడి వలిమా కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అబ్దుల్‌ఫైజ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బేతంచెర్ల: కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు, గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో..



పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో..



డోన్: విశేష అలంకరణలో స్వామివారు



డోన్: కొచ్చెర్వులో బండలాగుడు పోటీలు

కమనీయం.. సీతారాముల కల్యాణం

- ఊరూర శ్రీరామనవమి వేడుకలు
- రామాలయాలకు పోటెత్తిన భక్తులు
- కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవం

కొలిమిగుండ్ల: ఊరూర జగత్ కల్యాణమైన సీతారాముల పరిణయ వేడుక ఆద్యంతం కమనీయం..కనుల పండువగా జరిగింది. ముల్లోకాలు మురిసే విధంగా శ్రీరాముడు,సీతమ్మ ఒక్కటైన మధుర క్షణాలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాలన్నీ రామనామ జపంతో మార్మోగిపోయాయి. అంకిరెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాలయంలో స్వామివారి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు తిరుపతి లడ్డూలను ప్రసాదంగా అందించారు. అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాల మధ్య ప్రత్యేక పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు.

- డోన్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా శ్రీరామనవమిని ఘనంగా జరుపుకున్నారు. రామాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలు, గిలకబండ్ల పోటీలు, స్లో సైకిల్, గుండు పందెం, కోలాటం, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.
- బనగానపల్లె: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాజకుమారిగణియా, ఎస్పీ అధికాజ్ సింగ్ రాణా పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.
- డోన్ టౌన్: స్థానిక పాతపేట రామాలయంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. పెద్దవారి మాటలను మనసా వాచా కర్మణా ఆచరించాలని చెప్పింది శ్రీరామచంద్రుని దివ్యమైన పాత్ర. భర్త కష్ట సుఖాలను పంచుకోవాలని, ప్రతి విషయంలోను తోడుండాలని చెబుతుంది సీతమ్మ తల్లి అపురూప దివ్యగాథ, రామాయణంలోని ప్రతి పాత్ర జీవితానికి కావాల్సిన సుగుణాలు, కర్తవ్యాలు, అవగుణాలు, లోపాలు ప్రతిబింబిస్తాయి. అలాంటి రామాయణం మానవుని జీవితంలో ఆచరించ దగ్గ విషయాలను వేద పండితులు విషదీకరించారు.



కోవెలకుంట్ల: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కోవెలకుంట్ల: గుళ్లదూర్తిలో ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం

కల్యాణ వైభోగం

కోవెలకుంట్ల: శ్రీరామ నవమిని మండలంలో ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట, ముదిగేడు చౌరస్తా, శ్రీరాంనగర్, సీతారామనగర్, గాంధీనగర్‌తో పాటు మండలంలోని భీమునిపాడు, కంపమల్ల, కలుగొట్ల, జోళదరాశి, లింగాల, రేవనూరు, వెలగటూరు, బిజనవేముల, అమడాల, సౌదరదిన్నె, తదితర ప్రాంతాల్లో వెలసిన రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గుళ్లదూర్తిలోని సీతారామాశ్రమంలో భద్రాచలం తరహాలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రధాన అర్చకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో కల్యాణానికి భారీగా హాజరైన భక్తులు

- బేతంచెర్ల: స్థానిక పలక చింతమాను ఆంజనేయస్వామి, బైటిపేట గాడుబావి వీరాంజనేయ స్వామి, సంజీవనగర్ కాలనీల్లోని ఆలయాల్లో స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది.
- ప్యాపిలి: మండలంలోని సీతారాముల దేవాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.
- సంజామల: మండలంలోని కానాల, పేరుసోముల విష్ణుకంటి క్షేత్రంలో రామ్మోహన్‌స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



సంజామల: కానాల గ్రామంలో సీతరాముల కల్యాణమహోత్సవం జరుగుతున్న దృశ్యం



ప్యాపిలి: కలచట్లలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



డోన్: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కోవెలకుంట్లలో..



డోన్: వైఎస్ నగర్ శివాలయంలో సీతారాముల కల్యాణం



బేతంచెర్ల: శంకరాపురంలో సీతారాములు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేతంచెర్ల: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవితం గడపాలని సీఐ డి.వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో చేసిన తప్పులు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మాట్కా నిర్వహిస్తే జైలు జీవితం గడపక తప్పదని హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

డోన్ టౌన్/కోవెలకుంట్ల/బేతంచెర్ల: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఆయా మండలాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. డోన్ చింతలపేటతో పాటు బేతంచెర్లలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సందు వెంకటరమణ, మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. కోవెలకుంట్ల బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జిగాళ్ల లింగన్న ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగుర వేశారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ అందిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. నాయకులు ఆంజనేయులు, గుండా అశ్వర్థనారాయణ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.



డోన్‌లో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఔరా...గిజిగాడా..!

'తేలిక గడ్డి పోచలను దెచ్చి, రచించెదవీవు తూగుటుయ్యేల గృహంబు, మానవుల కేరికి సాధ్యముగాదు, దానిలో జాలరు, లందులో జిలుంగు శయ్యలు, నంతిపురంబు లొప్పకగా మేలు భళీ పులుంగుటెకిమీడవురా గిజిగాడ.. నీడజా.' ప్రముఖ తెలుగు కవి గుర్రం జాషువా గిజిగాడి గూడు గురించి వర్ణిస్తూ చెప్పిన పద్యం ఇది. తేలిక గడ్డి పోచలను తెచ్చి తూగుటుయ్యాల వలె నిర్మించే నీ పక్షి గూడు నిర్మించడం మానవులకు సాధ్యం కాదని దీనర్థం. నిజంగా ఇంజనీర్లు కూడా నిర్మించలేనంత గిజిగాడు అనే పక్షి తన గూడును నిర్మించుకుంటుంది. మగ పక్షి ఎంతో నేర్పుగా చిటారు కొమ్మలకు ఈ గూడును ఏర్పాటు చేసి ఆడపక్షిని ఆకర్షిస్తుంది. ఆడపక్షికి ఆ గూడు నచ్చితే అందులో ఆవాసం ఏర్పరుచుకుని మగపక్షితో సహవాసం చేస్తూ జీవనం గడుపుతుంది. ప్యాపిలి సమీపంలోని వెంగళాంపల్లి చెరువు వద్ద ఓ బ్రిడ్జి కింద చెట్టకు వేలాడుతున్న గిజిగాని గూళ్లు ఇవి. గిజిగాడి నేర్పును చూసి ఎవరైనా ఔరా గిజిగాడా అనాల్సిందే. -ప్యాపిలి



చిటారు కొమ్మలకు వేలాడుతున్న గిజిగాని గూళ్లు

కష్టపడి పనిచేస్తే పార్టీలో ప్రాధాన్యత

- నూతన కమిటీ అధ్యక్షులకు కాటసాని దిశా నిర్దేశం

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పార్టీ అనుబంధ విభాగాలైన యువజన విభాగం మండల అధ్యక్షుడిగా కోవెలకుంట్లకు చెందిన సింగారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా గున్నాల శేష జశ్వంత్‌రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, అంగన్‌వాడీ విభాగ మండల అధ్యక్షుడిగా సింగారెడ్డి దశరథరామిరెడ్డిని ఇటీవల కేంద్ర పార్టీ కార్యాలయం నియమించింది. ఈ మేరకు ఆదివారం వారు బనగానపల్లె చేరుకుని కాటసాని రామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయిలో కీలక పదవులు పొందిన వారిని అభినందిస్తూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువతకు అండగా ఉండి వారికి చేదోడు వాదోడుగా నిలివాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ పరంగా ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు జనార్దన్, రఘు, సాయి, మున్నా, షరీఫ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



కాటసాని రామిరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ మధుసుదన్ యాదవ్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

12న సత్యనారాయణవ్రతం

డోన్: పట్టణ శివారులోని కొండపై వెలసిన తిరుమల వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 12వ తేదీ సాయంత్రం 108 కుటుంబాలతో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు మాణిక్యప్రభు సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌గౌడ్, ఆంజనేయులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్త క్రిష్ణాంజనేయులుగౌడ్ కోరారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన వైష్ణవి

కొలిమిగుండ్ల: కోటపాడుకు చెందిన బీటెక్ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గైని విక్రమ్ కుమార్తె వైష్ణవి(19) కర్నూలులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతోంది. ప్రస్తుతం ఇంటి వద్ద ఉన్న అమ్మాయి..పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో మనస్తాపానికి లోనైంది. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి రసాయన మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించారు. చికిత్స కోసం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సీహెచ్‌సీలో వేధిస్తున్న వైద్యుల కొరత

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఫలితంగా వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. మరోవైపు ఉన్న వైద్యులపై పనిభారం అధికమవుతోంది. 2021లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి నుంచి సీహెచ్‌సీ స్థాయికి అప్ గ్రేడ్ అయింది. ప్రతి రోజు సీహెచ్‌సీకి 300 నుంచి 400 మంది వరకు రోగులు, గర్భిణులు వస్తుంటారు. ఇక్కడ ఏడుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ముగ్గురిలో ఒక్కరు అనస్థీషియా(మత్తు మందు వైద్యుడు) కాగా మరొకరు గర్భిణుల ప్రసవాలు లేదా అత్యవసర వైద్య సేవల కోసం వెళితే ఉన్న ఒక్క వైద్యుడు కోసం రోగులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. సీహెచ్‌సీలో నైట్ డ్యూటీ చేస్తే ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సీహెచ్‌సీలో అదనంగా 4 వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



బేతంచెర్లలోని శేషారెడ్డి సీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన రోగులు



సిమెంట్ కిటికీలు చోరీకి గురైన నందిపాడు షెల్టర్



కల్వటాలలో కుంగిపోయిన బస్‌షెల్టర్ లోపలి భాగం



కొలిమిగుండ్లలో అపరిశుభ్రంగా మారిన బస్‌షెల్టర్

శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్‌లు

కొలిమిగుండ్ల: ప్రయాణికుల సౌకర్యం కోసం గ్రామాల్లో నిర్మించిన బస్‌షెల్టర్‌లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2008లో అప్పటి కోవెలకుంట్ల ఎమ్మెల్యేగా ఉన్న దివంగత చల్లా రామకృష్ణారెడ్డి కొలిమిగుండ్ల జమ్మలమడుగు క్రాస్ రోడ్డు సమీపం , కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేట గ్రామాల్లో బస్ షెల్టర్లు నిర్మించారు. బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. అయితే కాలక్రమేణా నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. నందిపాడులో షెల్టర్ చుట్టూ ఏర్పాటు చేసిన సిమెంట్ కిటీకీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడం విస్మయం కలిగిస్తోంది. ప్రయాణికులు కూర్చునే అరుగులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్వటాలలో షెల్టర్ లోపలి భాగం కుంగిపోయి గొయ్యిలాగా ఏర్పడింది. కొలిమిగుండ్ల, తిమ్మనాయినపేట జంక్షన్‌లో నిర్మించిన బస్ షెల్టర్‌లు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ప్రధాన రహదారిలో నిత్యం జనం ఉండే చోట నిర్మించినా రక్షణ లేకుండా పోయింది. చీకటి పడితే మందుబాబులకు షెల్టర్లు అడ్డాగా మారుతున్నాయి. బస్‌షెల్టర్లకు మరమ్మతులు, రంగులు వేయించి పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాటిముంజ.. భలే మజా

ఈ ఏడాది వేసవికాలం ప్రారంభం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాలను తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తాటిముంజలకు భలే గిరాకీ ఏర్పడింది. విక్రయదారులు బేతంచెర్ల మండలం యంబాయి, బనగానపల్లె మండలం రాజుపాలెం తదితర ప్రాంతాల నుంచి తాటిముంజలు తీసుకొచ్చి కోవెలకుంట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో డజన్ రూ. 100 ప్రకారం విక్రయిస్తున్నారు. ప్రజలు వేసవితాపం తీర్చుకునేందుకు తాటి ముంజల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. -కోవెలకుంట్ల



తాటిముంజలు కొనుగోలు చేస్తున్న ప్రజలు